
# గంగాజలం

చక్కిలం విజయలక్ష్మి



ఆ భవంతి ముందు రిక్షా ఆగింది. ఫైవ్‌స్టార్ హోటల్ ముందు ఎద్దుబండి ఆగినంతగా తెల్లబోయి చూశాడు చేతిలో గన్ కూడా ఉన్న వాచ్‌మన్.

ఆగిన రిక్షాలోంచి శుభ్రమైన దేశీవాళీ పంచ, పొడుగు చేతుల జుబ్బా, పొందూరు కండువాతో నైమిశారణ్యం లోని ఋషితుల్యుడు లాంటి ఓ వ్యక్తి దిగాడు. కాళ్లకు... పాతబడిన కొద్దీ పాదాలను రక్షించే పనితనం పెంచుకున్నట్టున్న జోళ్లు, చేతిలో... సీనియారిటీతో మరింత స్వామి భక్తిని ప్రోది చేసుకుంటున్నట్టున్న గొడుగు, ఆయన కళ్ల లోని పూర్తి తేజస్సును ఈ లోకం భరించలేదని సగం ఫిల్టర్ చేసేందుకన్నట్టున్న కళ్లజోడు.... యుగాలు మారినా మారని సూర్యుడిలా మాస్టారు... రామనాథం మాస్టారు!

రిక్షాదిగి, భవనం కేసి చూశారు మాస్టారు. లక్ష్మీ దేవి ఆ భవనం మూసలో ముచ్చటపడి ఇమిడిపో యినట్లుంది. మాస్టారి చూపులో అంతగా లేని వాడు అలవిమాలిన ఐశ్వర్యాన్ని చూస్తున్న బెదురు, బెరుకు లేవు. నన్నెవరూ అందుకోలేని అందలాన్ని చూస్తున్న ఆశ, అసూయ లేవు. కొడుకు ఎత్తుకొ చ్చిన, వాడిది కాని ఆటవస్తువులా చూస్తున్నారు. కొడుకు ఆశకు, అమాయకత్వానికి సానుభూతిగా నవ్వుకుంటున్నట్లు ఆయన పెదాల మీద మంద హాసం.

''కౌన్ హై?'' వాచ్‌మన్

''మంత్రిగారిని కలవాలి'' మర్యాదగా చెప్పారు మాస్టారు.

''అపాయింట్‌మెంట్ ఉందా?''

''లేదు''

''అయితే వెళ్లండి. మీరు అయ్యగారిని కలవడం కలవడం కుదర్దు''

''పోనీ ఆయన్నే వచ్చి కలవమను'' నవ్వుతూ అన్నారు మాస్టారు.

పిచ్చివాడిని చూసినట్లు చూశాడు వాచ్‌మన్.

''ఆయన ఇప్పుడెవరినీ కలవరు. పార్టీలో ఉన్నారు'' కాస్త విసుగ్గా అన్నాడు వాచ్‌మన్.

''రామనాథం వచ్చాడని చెప్పు''

''విజిటింగ్ కార్డుందా?''

''లేదు''

''ఈ మాత్రం దానికి అయ్యగారే వచ్చి నిన్ను కలవాలా? విజిటింగ్ కార్డ్ కూడా లేనివాడివి అయ్యగారితో ఇంటర్వ్యూ దొరుకుతుందని ఎలా అనుకున్నావ్?'' కార్డు కూడా లేకున్నా స్వర్గానికి నిచ్చెన వేస్తున్న వాడిని చూసినట్లు ఎక్కసెక్కెంగా అన్నాడు వాచ్‌మన్.

''దొంగలు, స్మగ్లర్లు కూడా వేయించుకుంటారే, ఆ చిన్న అట్టముక్కేనా?'' కొంచెం చిలిపితనం తొంగిచూసింది మాస్టారి మాటల్లో...

''నీవెవరో మా అయ్యగారికే గురువులా ఉన్నావే!''

చిరునవ్వు మెరవగా అన్నారు మాస్టారు. ''అను మానమెందుకు? నేను మీ అయ్యగారి గురువుని''

తడబడ్తూ ''మాఫ్ కీజియే సాబ్... ఒక్క క్షణంలో అయ్యగారికి కబురు చేస్తాను'' అంటూ కార్డ్‌లెస్ ఫోన్‌లో మాట్లాడసాగాడు వాచ్‌మన్.

''మిమ్మల్ని తీసుకురమ్మంటున్నారు'' అంటూ లోపలికి దారిచూపించాడు.

మాస్టారు నాలుగడుగులైనా వేయకుండానే గబగబా ఎదురు వస్తూ కనిపించాడు మినిస్టర్ సత్యన్నారాయణ.

నలభై దాటని వయసు.. అందగాడు... ఆజాను బాహువు... దగ్గరికి వస్తూ మాస్టారిని చూశాడు.

అదే మనిషి, అదే వేషం, అదే హుందా తనం, యుగాలు మారినా మారని సూర్యునిలా మాస్టారు!

దగ్గరకు రాగానే తల బాగా ముందుకు వంచి చేతులు పూర్తిగా జోడిస్తూ ''నమస్కారం మాస్టారు'' అన్నాడు.

''జ్ఞానాభివృద్ధిరస్తూ...దీర్ఘాయుష్మాన్ భవ... బాగున్నావా సత్యం'' ఆప్యాయంగా అడిగారు మాస్టారు.

''బాగున్నాను మాస్టారు. లోనికి రండి'' వినయంగా అంటూ లోనికి తీసికెళ్లాడు సత్యనారా యణ.

బంగళా ముందున్న లాన్‌లో ఓ మూలగా చిన్న మందు పార్టీలాంటిది జరుగుతున్నట్లుంది. మాస్టారు వచ్చినట్లు అప్పటికే సూచన వచ్చిన ట్లుంది. సత్యనారాయణ నౌకర్లు హడావుడిగా సరంజామా అంతా సర్దేస్తున్నారు. అంతవరకూ పార్టీలో పార్టిసిపేట్ చేసిన అనుచరగణం అంతా మాస్టారిని చూసి ఒకింత వినయంగా లేచి నిలబ డ్డారు. మాస్టారిని తీసుకొని సత్యనారాయణ సరా సరి ఇంట్లోకి వెళ్లిపోయాడు.

మాస్టారికి భార్యను, కొడుకును పరిచయం చేశాడు. ఇల్లంతా చూపించాడు. తన పోర్టు ఫోలియో, పలుకుబడి, బాధ్యతలు, పరిధి, అధికా రాలు, విస్తృతి, దాని పరిధి వివరించాడు. అతనికి చాలా ఆనందంగా ఉంది. రామనాథం మాస్టా రంటే చాలా భక్తి, గౌరవం సత్యనారాయణకు. ముఖ్యంగా చాలా ఇష్టం. ఆరాధన. అలాంటి మాస్టారు స్వయంగా రావడం, తన హోదాను, అంతస్తును, ఆడంబరాన్ని చూడడం...చెప్పలేనంత సంతోషంగా, గర్వంగా ఉంది. తన పెళ్లికి కూడా ఆయన రాలేదు. తండ్రి పోయిన సందర్భంగా కాశీకి వెళ్లి ఉన్నారు. తర్వాత రాజకీయంగా తను మెట్లెక్కే హడావుడిలో పదవుల పందేరంలో, పరు గుపందెంలో మాస్టారి జ్ఞాపకం తెరమరుగే అయింది. అనుకోకుండా హఠాత్తుగా ఇప్పుడిలా...!

మాస్టారి అడుగులకు మడుగులొత్తేడు సత్యనా రాయణ. రాచమర్యాదలు చేశాడు. అయితే గీజ ర్‌లో హాట్‌వాటర్, షవర్ ఉన్న అల్ట్రామోడ్రన్ బాత్ రూంలో సున్నిపిండి, చన్నీళ్లతో హాయిగా స్నానం చేసి వచ్చారు మాస్టారు. బెడ్‌రూంలోని డ్రెస్సింగ్ టేబుల్‌మీద సత్యనారాయణ పెట్టిన పట్టుపంచ వదిలేసి తన చేతిసంచిలోని మల్లు పంచ తీసి కట్టు కున్నారు. పాతికమంది ఒకేసారి తినగలిగిన డైనింగ్ టేబుల్ను, దానిమీద వడ్డించి ఉన్న పంచ భక్ష్య పరమాన్నాలను కన్నెత్తి కూడా చూడకుండా ''అంత ఎత్తుకి అలవాటు లేదోయ్'' అంటూ కింద పీట వేయించుకొని కూర్చుని పప్పు, రసంతో అన్నం మాత్రం తిని ''రాత్రి పూట పెరుగు తినన


రిక్షాదిగి, భవనం కేసి చూశారు మాస్టారు. లక్ష్మీదేవి ఆ భవనం మూసలో ముచ్చటపడి ఇమిడి పోయినట్లుంది. మాస్టారి చూపులో అంతగా లేనివాడు అలవిమాలిన ఐశ్వర్యాన్ని చూస్తున్న బెదురు, బెరుకు లేవు. నన్నెవరూ అందుకోలేని అందలాన్ని చూస్తున్న ఆశ, అసూయ లేవు. కొడుకు ఎత్తు కొచ్చిన, వాడిది కాని ఆటవస్తు వులా చూస్తున్నారు. కొడుకు ఆశకు, అమాయకత్వానికి సానుభూతిగా నవ్వుకుంటు న్నట్లు ఆయన పెదాల మీద మందహాసం.


మ్మాయ్'' అంటూ పాలు తెప్పించుకొని తాగారు. రెండు సోంపు గింజలు నోట్లో వేసుకున్నాడు.

''నాకా ఏసీలు, డన్‌లప్ బెడ్లు పడవు సత్యం. ఓ చాప ఉంటే ఇలా పడేయమను అమ్మాయిని హాయిగా దాని మీద పడుకుంటాను ఆకాశాన్ని చూస్తు'' అన్నారు.

మాస్టారితో పాటు తనూ పైకి వెళ్లాడు సత్యనా రాయణ. అప్పటికే నౌకరు కుర్రాడు డాబా మీద చాప పరిచి పత్తితో చేసిన దిండు పెట్టాడు. అప్పటికే మాస్టారు బాగా అర్థమైనట్లున్నారు. సత్యనారా యణ భార్య ఐస్‌వాటర్ ఫ్లాస్క్ కాకుండా ఎప్పటిదో పాత రాగి చెంబు వెదకి తెల్లగా తోమించి దానిలో నీళ్లు పంపింది పైకి.

అది చూసి నవ్వుకున్నారు మాస్టారు.

''అమ్మాయి తెలివైందోయ్'' అన్నారు.

ఆయన అలా ఎందుకన్నారో అర్థం కాక ఇబ్బందిగా నవ్వాడు సత్యనారాయణ.

మాస్టారు చాప మీద కూర్చున్నారు. సత్యనారా యణ చాప పక్కన కింద కూర్చున్నాడు.

''ఇలా కూర్చో సత్యం''

''ఫర్వాలేదు మాస్టారు''

కుర్రాడొచ్చి డాబా మీద లైట్లు అన్నీ వేశాడు.

''అక్కర్లేదు బాబూ తీసేయ్'' అన్నాడు మాస్టారు.

నిమిషాలు గడుస్తున్నాయి... మౌనంతో పండు వెన్నెల... దాన్ని చూసేందుకన్నట్లు పైకి

పారాపెట్ వాల్ పొడుగునా విరబూసిన పూలకుండీలు పూల సజ్జల్లా ఉన్నాయి. మూడంతస్తుల మీద నుంచి చూస్తుంటే సిటీ అంతా చీకటి నదిలా, లెక్కకు మిక్కిలి లైట్లు నదిలో వదిలిన కార్తీక దీపాల్లాగా ఉన్నాయి. వైకుంఠం వచ్చి ఆ కొండ కొమ్మున దిగినట్లు బిర్లాటెంపుల్. పైన అర చంద్రుడు, చిలిపిగా నవ్వే నక్షత్రాలు! రాత్రి చిత్రించిన ఆ అందమైన భావ చిత్రం శబ్దించని గజల్‌లా ఉంది. మోగబోతూ ఆగిపోయిన కాలి గజ్జెల్లా ఉంది!

పాకి వచ్చిన సన్నజాజుల తాలూకు పరిమళం.... వెన్నెలకు పరిమళం కూడా ఉన్నట్లు ఒక మధుర మైన అనుభూతి!

పారాపెట్ వాల్ పొడుగునా విరబూసిన పూల కుండీలు పూల సజ్జల్లా ఉన్నాయి. మూడంతస్తుల మీద నుంచి చూస్తుంటే సిటీ అంతా చీకటి నదిలా, లెక్కకు మిక్కిలి లైట్లు నదిలో వదిలిన కార్తీక దీపాల్లాగా ఉన్నాయి. వైకుంఠం వచ్చి ఆ కొండ కొమ్మున దిగినట్లు బిర్లాటెంపుల్. పైన అరచంద్రుడు, చిలిపిగా నవ్వే నక్షత్రాలు! రాత్రి చిత్రించిన ఆ అంద మైన భావ చిత్రం శబ్దించని గజల్‌లా ఉంది. మోగ బోతూ ఆగిపోయిన కాలి గజ్జెల్లా ఉంది!

''ఇక్కడ కూర్చుని ఇలా ఎప్పుడైనా ఎంజాయ్ చేశావా సత్యం?'' అడిగారు మాస్టారు చూపు మరల్చకుండా.

''లేదు మాస్టారు అంత టైం ఉండదు'' నసిగాడు సత్యనారాయణ.

గుంభనగా నవ్వారు మాస్టారు.

టైం!

తానొచ్చినప్పుడు లాన్‌లో తీరిగ్గా పెట్టుకున్న పార్టీ...!

ఆ తర్వాత కాసేపు లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు. వాళ్ల సొంత ఊరి కబుర్లు, సత్యనారాయణ చిన్ననాటి విషయాలు, స్నేహితులు, చదువు, అల్లరి, మాస్టారి స్ట్రిక్ట్‌నెస్, ఎట్ ద సేం టైం తన విద్యార్థుల చీమిడి ముక్కులను స్వయంగా తుడిచే మాస్టారి ప్రేమ, వాత్సల్యం... ఎన్నో... అన్నీ. మాస్టారు ఒకసారి బెత్తంతో వాయిస్తే సత్యం నిక్కర్లోనే పాస్ పోసుకున్న సంఘటన గుర్తు చేసుకున్నారు. ఒక సుదీర్ఘమైన నవ్వు. తర్వాత నిశ్శబ్దం.. క్షణాలు... నిమిషాలు...

సత్యనారాయణకు టెన్షన్‌గా ఉంది. అసలు మాస్టారు ఎందుకొచ్చినట్లు? లోకాభిరామాయణం మాట్లాడేందుకు మాత్రం కాదు. విషయం అయితే ఏదో ఉంది. ఆ విషయం తప్ప అన్నీ మాట్లాడుకున్నారు. ''ఎందుకొచ్చారు?'' అని అడగలేకపోతున్నాడు. మర్యాద కాదు. అందులోనూ మాస్టారు.

మాస్టారికేసి చూశారు.

మౌనంతో మాస్టారు... మంచిగంధం లాంటి మౌనంతో... లోతైన వాడికి, మేధావికి పర్యాయ పదం మౌనం. మాస్టారు తరచూ ప్రతిగా ఆస్వాదించే ఆనందం మౌనం.

దూరంగా... కింద నేలమీద విచిత్రమైన చీకటి సముద్రం, వెలుతురు తెరచాపలెత్తి సాగిపోతున్న ఓడల్లాగా కదిలే వాహనాలు.. ఇంకా ఆకాశంలోంచి తెగి రాలిపడిన నక్షత్రాల్లా, నల్లటి ముఖమల్ బట్ట మీద ఒలికిపోయిన నక్షత్రాల్లా ఊహలు.... మాస్టారు ఈ కృతకమైన అందాన్ని, అంశాల్ని వదిలి ప్రశాంతమైన ప్రాకృతిక సౌందర్యాన్ని ఆకాశాన్ని చూస్తున్నారు. ఎప్పుడూ చూసే ఆకాశాన్ని.

ఉన్నట్టుండి అన్నారు మాస్టారు ''ఇక్కడకు వచ్చి నిన్ను చూశాక నాకెంతో సంతోషమేసింది సత్యం''

ఔను మరి తన శిష్యుడి ఉన్నతి చూసి ఏ గురువు సంతోషించడు? ఆస్తి, అంతస్తు, హోదా... ఉక్కిరిబిక్కిరి అయ్యాడు సత్యనారాయణ.

''అయితే దానిక్కారణం నీ హోదా, నీ అంతస్తు కాదు. నీ ప్రవర్తన. నీ ప్రవర్తన చూశాక నేను వచ్చిన పని కాదేమోననే భయం పోయి అవుతుందనే ధైర్యం వచ్చింది.

''...''

ఇంత ఆస్తి, అంతస్తు, పదవి ఉండి కూడా వినయాన్ని చూపావని కాదు. నీ వినయం వెనుక భూతంలా నిలిచిన ఆస్తి, అంతస్తుల తాలుకూ అహం లేదు. సాదాసీదాగా చిన్నప్పటి సత్యంలా వినమ్రంగా, హనుమంతుడిలా ఆర్ద్రోక్తిగా... తోక ఒక్కటే తక్కువ'' ఆప్యాయంగా నవ్వారు మాస్టారు.

సత్యం కూడా నవ్వాడు. హాయిగా

తోక ఒక్కటే తక్కువ. ఇలా అనగలిగే ధైర్యం, ముఖ్యంగా ప్రేమ, వాత్సల్యం ఒక్క మాస్టారికే ఉన్నాయి.

సత్యం చాలా రోజుల తరువాత భేషజం లేని నవ్వు నవ్వాడు. నిజమే... తనకిప్పుడు గమనింపులోకి వస్తోంది. తను మాస్టారి పట్ల చూపుతున్న భక్తి వినయాల్లో భేషజం లేదు. తన కొమ్ములున్నాయన్న అహం లేదు. తనను చూసి మాస్టారు సంతోషించాలనే నిజాయితీతో కూడిన ఆశ తప్ప. పూర్తి సిన్సియర్‌గా, పూర్తి సరెండర్ అయి....

ఆలోచన ముగించి చూశాడు సత్యనారాయణ.

మాస్టారు... మరి కాసేపు మౌనంతో... ఆకాశం ఇస్తున్న ఆనందంలో... ఒక ధ్యానయోగిలా....

సత్యానికి ఆశ్చర్యంగా ఉంది. తన ఇంటి కప్పు మీద ఇంత అద్భుతం ఉందా? ఈ రోజు వరకూ తన దృష్టికి రాని అద్భుతం. సత్యనారాయణకు పశ్చాత్తాపం లాంటిది కలిగింది. నిజమే... అందం, ఆనందం, అద్భుతం ప్రకృతిలోని ప్రతి అంశలోనూ ఉన్నాయి. కాకపోతే చూసే దృష్టిని బట్టి, ఆస్వాదించే మనసును బట్టి మన ముంగిట్లోనే ఉన్న పారిజాతాన్ని వదిలి ప్లాస్టిక్ పూలని వెంబడిస్తున్నాడా తను?

తల విదిలించాడు సత్యనారాయణ. ఏమిటీ తనింత సిల్లీగా ఆలోచిస్తున్నాడు! తనో మినిస్టర్. లక్షల మందిలో ఏ ఒక్కరినో వరించే వరం అది. డబ్బు, పలుకుబడి, హోదా, జనం, దండలు, చప్పట్లు... రాత్రిదేముంది? ప్రతి రాత్రి వచ్చేదే. ఆకాశాందేముంది? ప్రతి చోటా ఉండేదే. ఇప్పుడు మాస్టారు ఎందుకు వచ్చినట్లు? ఏం పనిమీద వచ్చినట్లు? పని... ఔను. పని వరకూ కన్‌ఫర్మ్ అయింది. అయితే ఏమిటది? ఏం అడగబోతున్నారు మాస్టారు? తానెన్నో కథలు చదివాడు. ఎదిగిన కూతురి పెళ్లి కోసమో... నిరుద్యోగి కొడుకు ఉద్యోగం కోసమో, మోయలేని అప్పుల బరువు దింపుకునేందుకో శిష్యుల్ని వెతుక్కుంటూ రావడం... కానీ మాటల మధ్యన తెలిసింది. మాస్టారికి ఇంకా పెళ్లికాని కూతురు కానీ, ఉద్యోగం లేని కొడుకు కానీ లేరు. అప్పుల బాధ లేదు. ఆ పక్క నుంచి నరుక్కువస్తారా మాస్టారు? తన మీద తనకే అసహ్యం వేసింది సత్యనారాయణకు. ఏ పనైనా నిజాయితీగా, సహజంగా జరిగిపోవాలనుకునే మాస్టారు అర్హతలేని పనికోసమో లేదా మనిషికోసమో పలుకుబడితో అర్హత కల్పించుకునే స్థాయికి దిగజారరు మరి? ఆయన ఇలాకాలో ఎవరినైనా అరెస్ట్ చేశారా? వారిని విడుదల చేయించే? ఛీఛీ తను తన స్థాయికి తగినట్లు ఆలోచిస్తున్నాడు కానీ మాస్టారి స్థాయి మరిచాడు.

సత్యనారాయణ ఆలోచన పట్టేసిన వాడిలా మాస్టారన్నారు ''సత్యం నీవేమాలోచిస్తున్నావో నాకు తెలుసు. ఔను నిజం... నిన్నొకటి అడగడానికి వచ్చాను. అదేమిటో తెలుసా?''

''.....''

''గురుదక్షిణ''

''మాస్టారు!''

''ఔను సత్యం. నాకు గురుదక్షిణ కావాలి''

''అంతకంటేనా మాస్టారు అడగండి'' సంతోషంగా అన్నాడు.

''తప్పకుండా.. అయితే ద్రోణుడు అర్జునుడిని అడిగినట్లు శత్రువును పట్టితెమ్మని అడగను. నాకు శత్రువులు లేరు కాబట్టి. ద్రోణుడు ఏకలవ్యుడిని అడిగినట్లు నీ బొటన వేలు కావాలని అడగను. నాకు నీకంటే ప్రియమైన అర్జునుడు లేడు కాబట్టి.''

కొంచెం ఊరట కలిగింది సత్యనారాయణకు. మరీ అంత కష్టమైనదీ, కఠినతరమైనదీ, తనకు మింగుడు పడనిది అడగరు మాస్టారు. అంత

వరకూ గ్యారంటీ. తనకు సంబంధించినంత వరకూ...తను ఏదైనా ఇవ్వగలడు.

''....అంతకంటే విలువైనదే అడుగుతాను. అయితే నా దృష్టిలో కాదు. నీ దృష్టిలో'' చిలిపిగా నవ్వారు మాస్టారు.

గతుక్కుమన్నాడు సత్యం

మాస్టారి దృష్టిలో కాకుండా తన దృష్టిలో విలువైనది...?

డబ్బు? పలుకుబడి? ఓట్లు? సీట్లు? చప్పట్లు...?

''సరే ఎక్కువసేపు నిన్ను ఇబ్బంది పెట్టడం నాకిష్టం లేదు. నేనడుగుతున్న గురు దక్షిణ...''

ఆతృతగా చూశాడు సత్యనారాయణ.

''... నేనడుగుతున్న గురుదక్షిణ.. నీలోని స్వార్థం''

తన కర్థంగాని భాషలో ఏదో అన్నట్లు సత్యనారాయణ బ్లాంక్‌గా చూశాడు.

మళ్లీ రిపీట్ చేశారు మాస్టారు ''నాకు కావలసిన గురుదక్షిణ నీలోని స్వార్థం. దాన్ని పూర్తిగా నాకిచ్చేయాలి''

గురుదక్షిణ, స్వార్థం, కావలసిన.. విడివిడిగా ఈ మాటల అర్థం తెలుసు సత్యనారాయణకు. కానీ ఈ అన్నీ కలిపిన ఆ వాక్యం వింతగా వుంది అతనికి. ఇదివరకెవరూ ఇలాంటి వాక్య నిర్మాణం చేసి వుండరు. ఒక గురువు గురుదక్షిణగా శిష్యుడిలోని స్వార్థాన్ని కోరడమేమిటి? అయినా ఈ మేరకు వాక్యం కరెక్టేనా?

మాస్టారు వెన్నెల వెలుగులో, ఆలోచిస్తున్న శిష్యుడి కళ్ళలోకి చూస్తున్నారు.

సత్యనారాయణ స్వార్థపరుడే. కానీ తెలివైన వాడు. పైగా రామనాథం మాస్టారి శిష్యుడు. అదివరకు అనుభవంలోకి రాని పదాల కలయిక, ముందు అయోమయంలోకి పడేసినా క్రమంగా అతనికి అర్థం కాసాగింది. క్రమంగా, క్రమక్రమంగా. పూర్తిగా అర్థం అయ్యేసరికి సత్యానికి ప్రథమంగా కలిగిన భావం.. సిగ్గు.

తన లోలోన తను ఎంతో భద్రంగా దాచుకుని పెంచి పోషించుకున్న స్వార్థాన్ని తన గుండె కిటికీ లోంచి తొంగిచూసి, మెలికలు తిరిగే పామునలా పట్టి వెలికితీసి తన ముందు పడేసిన మాస్టారి ముందు సిగ్గుపడిపోయాడు సత్యనారాయణ. తల వంచుకున్నాడు.


మాస్టారు చూసి ఆనందపడ్తారనుకుని గర్వపడిన తన తాలూకు అంతస్తు పేక మేడలా కుప్పకూలి మాస్టారి జాలి నవ్వుల ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఆయన ఔన్నత్యపు మేరు పర్వతం ముందు తన అంతస్తుల భవంతి బొమ్మరిల్లులా చిన్నబోయింది. ఏం ఆలోచించాడు తను! ఆంజనేయుడి ముందు కుప్పిగెంతులు వేయబోయాడు.

పున్నమి చంద్రునిలా అంతవరకూ చల్లగా, ప్రశాంతంగా వున్న మాస్టారి వదనం ప్రాతఃకాలం గడిచిపోయి వేడి పెంచుకుంటున్న సూర్యునిలా గంభీరమైపోయింది.

''సత్యం, నేను నీ గురించి విన్నదాన్ని బట్టి అసలు నీవు నాకు తగిన రెస్పాన్స్ ఇవ్వవనుకున్నాను. కానీ భేషజం లేని నీ ఆహ్వానం, ప్రస్తుత నీ స్థితి, స్థాయి గుర్తే లేని నీ ప్రవర్తన, నీ వినయం, విధేయత, భక్తి.. నీలోని నా శిష్యుడు పూర్తిగా మరణించలేదనే విషయాన్ని స్పష్టం చేశాయి. నేవచ్చిన పని అవుతుందనే ధైర్యం కలిగింది. లేకపోతే గేటు దగ్గర్నించే నిన్ను చూసిన మరుక్షణమే వెనక్కు వెళ్లి వుండేవాడిని.


సత్యం.. నీవు రాజకీయంగా, సాంఘికంగా, మేధోపరంగా చాలా ఎదిగావు. అయితే వాటితో పాటు స్వార్థమూ! నీ గురించి నేను వింటూనే వున్నాను. ఒకనాటి నీ గురువుగా ఆ విషయం నన్నెంతో వేదనకు గురిచేసింది.

సత్యం! గడ్డి తినే మంత్రులున్నారు. తౌడు తినే మంత్రులున్నారు. అడవుల్ని తినే మంత్రులున్నారు. నీవు ఏకంగా ఆ మంత్రుల్నే తినేస్థాయికి ఎదిగావని విన్నాను. ఔన్నత్యపు సోపానాలు ఎక్కడం కష్టం. కానీ జారుడు మెట్లు దిగడం చాలా సులభం. నీకా ఉద్దేశ్యం వుంటే చాలు. అసలవి దిగనివ్వవు. నీకాశ్రమ లేకుండా జారి పడ్తావంతే. దిగజారడం మొదలు పెట్టాక ఆ దిగజారుడికి అంతమే వుండదు. ఎక్కడిదాకా జారదామని ఈ జారుడు మొదలెట్టావ్? లక్షలో ఒకరికి రాని అవకాశం నాయకుడు కావటం, మరీ మంత్రి కావటం. దీన్ని కూడా స్వార్థానికే వుపయోగించాలా? మనకు ఐదు రూపాయలు, పది రూపాయలు ఎప్పుడూ దొరుకుతూనే వుంటాయి. వాటిని ఎలాగైనా ఖర్చు పెట్టుకోవచ్చు. సిల్లీగా, చిల్లరగా. కానీ ఏకంగా లక్ష రూపా



యలు దొరికితే? అలాంటి సందర్భం చాలా అరుదు. అలాంటి సందర్భంలో దాన్ని ఓ గొప్ప పనికి వుపయోగించాలి. లక్ష రూపాయలతో మాత్రమే అయ్యేపనికి. లక్ష రూపాయలతో తప్ప కాని పనికి. ఎందుకంటే ఆ సందర్భం ఎప్పుడో గానీ రాదు గనుక. మరి దాన్ని కూడా చిల్ల కింద మార్చి ఐదూ పదుల పనులకు వుపయోగించు కుంటే సార్థకత ఏముంది? నువ్వు ప్రజానాయకుడివి కావటం, మంత్రివి కావటం నీకు దొరికిన అపురూపమైన వరం. అరుదైన సందర్భం. జన్మ జన్మల సుకృతం. మరి ప్రజాసేవ చెయ్యకుండా, నీ వంశం తరించేలా సత్కీర్తి సంపాదించుకోకుండా స్వార్థానికి వుపయోగిస్తావా? డబ్బు సంపాదన కోసం, అస్మదీయుల లబ్ధికోసం దుర్వినియోగం చేస్తావా? ఈ పని వ్యాపారం చేసి చెయ్యొచ్చు.

మరోటీ మరోటీ, మరేదైనా చేసి




చేయొచ్చు. ప్రజలకు సేవ చేసే అపురూపమైన వరాన్ని పణం పెట్టి కాదు. తరతరాలు నిలిచిపోయే కీర్తిని బలిదానం చేసి కాదు. సత్యం, గంగాజలాన్ని పూజ కోసమే వినియోగించాలి. పురచేతి వాడకానికి కాదు...''

విచలితుడయ్యాడు సత్యనారాయణ. చివరి వాక్యాలకు అతని ఒళ్లు, మనసు, ఆత్మ గగుర్పొడిచాయి. 'గంగాజలాన్ని పూజకోసమే వినియోగించాలి. పురచేతి వాడకానికి కాదు'

సత్యం కళ్ళలో గిర్రున నీరు తిరిగింది.

శిష్యుడు కేసి చూశారు మాస్టారు.

భుజం మీద ప్రేమగా, చనువుగా తడ్తూ ''డబ్బు సంపాదించే అవకాశాలు జీవితం పొడుగునా వస్తూనే వుంటాయి. వాటికి విలువే లేదు. వాటిని నీ వెలాగైనా వుపయోగించుకోవచ్చు. ఉపయోగించుకోకపోయినా బాధలేదు. (జీవితంలో డబ్బుకు ఎంత ప్రాధాన్యత వుందో అంత అప్రధానమైనది కూడా అదే. నైతిన విలువలతో పోల్చినప్పుడు) కానీ ప్రజలకు, తద్వారా నీ దేశానికి సేవ చేసే సువర్ణావకాశం, అదీ పదవి అనే పారిజాతాల్లో పెట్టి నీ కందించబడిన అవకాశం ఎప్పుడోగానీ, ఎవరికోగానీ రాదు. చిల్లర పనుల కోసం దాన్ని బలి పెట్టకు. జాతి నిన్ను క్షమించదు''

''మాస్టారూ''

''ఔను సత్యం. నీ భవిష్యత్ వంశీయులు కూడా నిన్ను క్షమించరు. దేశ చరిత్రలో తమ వంశ కీర్తిని సువర్ణాక్షరాలతో లిఖించే అవకాశాన్ని చేజేతులా మట్టిపాలు చేశావని...''

''మాస్టారూ!''

''ఔను సత్యం. ఎప్పుడయితే పదవీ బాధ్యతను నెత్తికెత్తుకున్నావో అప్పుడే ఈ దేశం నీ తల్లి అయింది. నీ బిడ్డ అయింది. దాన్ని రక్షించవలసిన బాధ్యత, ఆ రీత్యా కృతజ్ఞత చూపవలసిన ధర్మం నీది. స్వార్థం కోసం ఆ ఇద్దరినీ తాకట్టుపెట్టే వాడు, నాయకుడి సంగతి దేవుడెరుగు.. అసలు మనిషే కాదు''

''నాలో స్వార్థం''

'' ఔను. నీలోనే. స్వార్థమే. చూడు, ఈ బంగళా, ఈ ఐశ్వర్యం, ఈ భోగాలు.. ఒకప్పుడు నీకేమున్నాయి? మనూళ్లో మీది మోతుబరి కుటుంబమే. కాదనను. కానీ ఇంత భవిష్యత్ సంపదకు ఆ నాటి ఆస్కారమేమిటి? ఆ తర్వాతయినా మీ కుటుంబంలో ఎవరేం చేశారని? ఏం సంపాదించారని? నీ స్వార్థం చేసిన జాదూమంతర్. ఏదేమైనా నీ స్వార్థం అనే బలహీనపు కుంటి కాలు ఈ పర సంపద అనే అతికాయాన్ని ఎంతోకాలం మోయలేదు సత్యం. చతికిల బడ్తుంది...''

''మాస్టారూ...నేను''

ఆగు సత్యం. చెప్పనీ. అరిషడ్వర్గాలలో స్వార్థం అనేదాన్ని చేర్చకపోవడం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తూ వుంటుంది. అంతకంటే నీచమైన దుర్గుణం మరో లేదు. స్వార్థాన్ని వదులుకో సత్యం. గురుదక్షిణగా నాకిచ్చెయ్. స్వార్థం లేనినాడు ఏ పని చేసినా దానికి మాలిన్యం అంటదు''

మాస్టారు తాను చెప్పవలసింది చెప్పేసినట్లు, శిష్యుడికి ఆలోచించుకునేందుకు కావలసిన సమయం ఇస్తున్నట్లు తిరిగి ఆకాశ ఆస్వాదనలో మునిగిపోయాడు. చల్లని సమీరాలు శరీరాన్ని తాకుతూ అనిర్వచనీయమైన హాయిని కలిగిస్తూ వుంటే దాన్ని మనస్ఫూర్తిగా అనుభూతిస్తున్నట్లు కళ్లు మూసుకున్నారు.

సత్యనారాయణ.. ఇక ఆలోచించేందుకేమీ లేదు. తన చిన్నప్పట్నుంచీ అంతే. మాస్టారు ఏదైనా పాఠం చెప్పే దాన్ని ఆయన ఫీలయి శిష్యులూ ఫీలయ్యేలా చెప్పటం ఆయన పద్ధతి, ప్రత్యేకత. ఇప్పుడూ మాస్టారు ఏదయితే ఫీలయి చెప్పారో దాన్ని ఆయన తనకు చెప్పటమూ, తాను దాన్ని ఫీల్ కావటమూ జరిగిపోయాయి. నిజమే. గంగాజలాన్ని పూజకు కాకుండా పురచేతి వాడకానికి వినియోగించాడు తను.

సత్యనారాయణకు మళ్లీ కళ్లలో నీళ్లు తిరిగాయి. చాలాసేపు ఆవేదనో, ఆనందమో అర్థంకాని భావ ప్రవాహంలో మునిగితేలాడు. ఆ తర్వాత మాఘ స్నానం చేసి మాలిన్యాన్ని పోగొట్టుకున్నట్లు బాగా తెప్పరిల్లాడు సత్యం. తేలిక పడ్డాడు.

''మాస్టారూ..''

కళ్లు తెరిచారు మాస్టారు. ఆయన కళ్లలో ఎలాంటి సందేహం లేదు. సత్యం నిర్ణయం ఎలా వుంటుందనే ఆతృత అసలే లేదు. సమాధాన పత్రం రాసినప్పుడే తన ఫలితం తెలిసిన విద్యార్థిలా వున్నారు.

''చెప్పు సత్యం''

''నాదో సందేహం...''

''చెప్పమనేగా''

కొంచెం తటపటాయించినా అడిగాడు ''మాస్టారూ! నేనొక్కణ్ణే మీ శిష్యుణ్ణి కాదు. వేలాది మంది మీ శిష్యుల్లో ఎందరో డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ఐ ఏ ఎస్‌లు కూడా స్వార్థ పూరితంగానే జీవిస్తున్నారు. మీరు...మీరు.. వారందరి దగ్గరకు వెళ్లారా? ఇలా గురుదక్షిణ స్వీకరించారా? నేను ఇలా అడుగుతున్నది మిమ్మల్ని కించపరచాలని గానీ, 'నన్ను అడిగాక వాళ్లను అడగలేదా' అని అక్కసుతోగానీ కాదు. నిజాయితీగా, ఆసక్తిగా, అలా జరగాలనే ఆకాంక్షతో అడుగుతున్నాను''

''లేదు. ఎందుకంటే ఒక డాక్టర్ స్వార్థపరుడైతే కొందరు పేషెంట్లు నష్టపోతారు. ఒక లాయర్ స్వార్థపరుడైతే కొందరు క్లయింట్లు నష్టపోతారు. కానీ ఒక రాజకీయ నాయకుడు స్వార్థపరుడైతే

దేశం యావత్తూ నష్టపోతుంది. దేశ నాయకుడు నిస్వార్థ పరుడైతే, సమర్థుడైతే ఆటోమాటిగ్గా డాక్టర్లూ, లాయర్లూ, ఐఎఎస్‌లూ అలాంటి ఇంకెందరో తమ తమ పంథా మార్చుకోక తప్పదు''

ఆనందంతో, గర్వంతో సత్యనారాయణ మనశ్శరీరాలు వుప్పొంగాయి. పులకించిపోయాయి. ప్రతి విద్యార్థికి అలాంటి గురువుంటే? ప్రతి గురువూ తన శిష్యుల పట్ల ప్రతి పౌరుడూ తన దేశం పట్ల ఇంతటి బాధ్యత ఫీలయితే?

'' ఇంతేనా సత్యం?''

''మరో ప్రశ్న''

'' ఏమిటి?''

''మీ జీవితంలోని జీవనంలోని స్వచ్ఛత, సహజత, నిజాయితీ జగమెరిగిన సత్యం. అయినా కనీసం నయాపైస అప్పు కూడా లేకుండా ఇంత సంతృప్తికరంగా బాధ్యతల్నెలా పూర్తి చేశారు? ఇంత నిశ్చింతగా ఎలా జీవించగలుగుతున్నారు?'' చిన్న గోటితో పెద్ద మాటల్ని వల్లించే కుర్రాడిలా నంగినంగి అడిగాడు సత్యనాడు. మాస్టారి నడిగే మాటేనా ఇది? అయినా అడిగాడు.

మృదుమందహాసం చేశారు మాస్టారు. ఎలాంటి క్లిష్ట ప్రశ్నకైనా, అల్లాటప్పా సందేహానికైనా ఏకరీతిగా సమాధానం చెప్పగల ఆనవాయితీగల గురువుగా ఆయన పెదిమలు విప్పారు ''ఇందులో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. మనది కాని సంస్కృతిని, సంపదను, వ్యవహారాలను నెత్తికెత్తుకోవాలనుకున్నప్పుడే సమస్య. మాదేముంది? సంకరం లేని జీవన సరళి. నల్లేరు మీద బండిలా, తోటలోని పాటలా హాయిగా సాగిపోతోంది...''

''అంటే...?''

''అంటే.. మరేం లేదు. మాది సాత్విక శాఖాహారం. సహజ సంపూర్ణాహారం. అందువల్ల ఆడంబరమైన తిండికోసం మేమెప్పుడూ అప్పుచేయలేదు. ఫలహారానికి మా పెరట్లో కాచే జామ, అరటి పళ్లే తప్ప జాములు, యాపిల్ జ్యూస్‌లు మే మెరగం. సిరి చాపలతో తప్ప మా సిటౌట్ సోఫా సెట్లతో ఫర్నిష్ చేయబడలేదు. నా కూతురికి అచ్చమైన పదహారణాల తెలుగింటి ఆడపడుచులా పావడా పరికిణీలే తప్ప వేలాది రూపాయలు బలిగొనే బాంగ్రా చోళీలు, పట్టు పంజాబీ డ్రెస్‌ల పేర్లు కూడా తెలియవు. మిడ్ నైట్ పార్టీలు, పబ్‌లు, విదేశీ ఛానళ్లు మా ఇంట్లో నిషిద్ధం. అందుకని నా కొడుకు ర్యాంక్స్‌తో పాసయి, స్కాలర్‌షిప్స్‌తో చదువుకుని, నిజాయితీగా ఉద్యోగం తెచ్చుకున్నాడు. నా అల్లుడు లక్షల కట్నంతో కొన్న డాక్టర్, ఇంజనీర్, ఐ ఎ ఎస్ ఆఫీసర్ కాదు. నా కూతుర్ని 'తులసిమొక్క' అని మెచ్చుకుని కోరి మరీ చేసుకున్న మామూలు స్కూలు మాస్టరు. ఇక నా భార్య పచ్చని పసుపు తాడులోనే ఏడువారాల నగల్ని చూసుకుని మురిసిపోయే అమాయకపు ఇల్లాలు. ఇంత పిచ్చి జనాలున్న మా ఇంట్లో 'అప్పు' అనే 'లగ్జూరియస్ వర్డ్' ఎలా ప్రవేశిస్తుంది? ప్రవేశించాలని అది ప్రయత్నించినా 'నిరాడంబరత' అనే మా ఇంటి పెంపుడుకుక్క దాన్ని తరిమికొడ్తుంది. (ఇక్కడ 'కుక్క' అనే మాట చెడును ప్రవేశించనివ్వని 'మంచి' అనే అర్థంలోను, పెంపుడు జంతువును పెంచుకున్నంత ప్రేమతో, ఇష్టంతో నిరాడంబరత్వాన్ని పెంచుకున్నామన్న మమకారపు మాటగాను వాడాను తప్ప నీచార్థంతో కాదు-రచయిత్రి)

ఇక నిశ్చింత సంగతి. ఫాల్స్ ప్రిస్టేజ్ గొడవలేదు కాబట్టి సహజమైన, సరళమైన జీవన విధానం ఒత్తిళ్లు లేని ప్రశాంతతను ప్రసాదించింది. ఇంకేముంది? అంతా నిశ్చింతే'' ముసి ముసిగా నవ్వారు మాస్టారు.

అదంతా జీర్ణం చేసుకోవడానికి కాస్త సమయం పట్టింది సత్యానికి.

''ఇంకేమైనా?'' ప్రశ్నార్థాహ్వానిస్తూ చూశారు మాస్టారు.

''మరో ప్రశ్న... చివరిది''

''కానివ్వు''

సత్యనారాయణలో కూడా కొంచెం కొంటెతనం తొంగిచూసింది. భయభక్తులతో పాటు చనువూ ఆ మాస్టారు నేర్పిందే.

''మీరు అడిగిన గురుదక్షిణ నేను కాదంటే? లేదంటే? ఏం చేస్తారు?''


చిరునవ్వు నవ్వారు మాస్టారు. ఆ నవ్వుతో తల కొట్టేసి నట్లయింది సత్యానికి. ఎందుకంటే సింహాసనం మీద కూర్చోబెడ్తుంటే చేతుల్లోంచి జారి చెప్పులు కొరుకుతానంటూన్న అమాయకపు కుక్కపిల్లను చూసి నవ్వినట్లుంది ఆ నవ్వు. అదే నవ్వు కంటిన్యూ అవుతూండగా సమాధానం చెప్పారు మాస్టారు.

''రెండు చేస్తాను. ఒకటి.. ఈసారి ఎన్నికల్లో ఎవరూ నీకు ఓటు వేయకుండా నా శాయశక్తులా పోరాడతాను. రెండు.. ఇప్పట్నుంచీ నేను చదువు చెప్పబోయే విద్యార్థులకు 'ఓం' కంటే ముందు 'నిస్వార్థం' అనే పదాన్ని ముందుగా దిద్దిస్తాను''

దానం అడుగుతూ వామనావతారంలో వున్న విష్ణుమూర్తిలా కనిపించారు మాస్టారు సత్యనారాయణకు. అడిగిన మూడో అడుగు స్థలం ఇవ్వక పోతే పాతాళానికి తొక్కేస్తానన్నట్లుగా విశ్వరూపంతో కనిపించారు.

తర్వాత చాలాసేపు మాస్టారు 'కళ్లు మూసుకుని' తన అమాయకపు శిష్యుణ్ణి చూడసాగారు. సత్యనారాయణ కళ్లు 'విప్పార్చుకుని' తన అపురూపమైన గురువును చూడసాగాడు.

ఆ తర్వాత... చాలా సేపటి




తర్వాత, మాస్టారు కళ్లు తెరుస్తున్న క్షణానే సత్యనారాయణ చేతులు మాస్టారి పాదాలను స్పృశించాయి. మాస్టారు ఆప్యాయంగా నవ్వుతూ సత్యం తల నిమిరారు. రెండు కన్నీటి బొట్లు గంగా జలంలా మాస్టారి పాదాలను అభిషేకించాయి.

మాటలు లేని మౌనంలో మధురమైన అవగాహన!

తర్వాత సత్యనారాయణ లేచి ''పడుకోండి మాస్టారూ. చాలా ప్రొద్దుపోయింది'' అంటూ ఇవతలికి రాబోయాడు.

''సత్యం'' పిలిచారు మాస్టారు.

''మాస్టారూ?''

''సత్యం, నీ ఐదో ఏట, నీకు నేను ప్రారంభించిన విద్యాభ్యాసం ఈరోజు, ఇప్పుడు ముగిసింది. ఇక వెళ్లు''